Visit us @ http://epaper.suryaa.com

సూర్య 18 వ వసంతంలోకి...


నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

నిజామాబాద్ కామారెడ్డి

ఆదివారం, 20 అక్టోబర్ 2024

పేజీలు : 05



# ఇద్దరు దొంగల అరెస్ట్

గాంధారి, సూర్య మేజర్ న్యూస్, అక్టోబర్ 19



గాంధారి మండలంలోని జివ్వాడి గ్రామంలో గత కొన్ని రోజుల క్రితం ఒక ఇంట్లో దొంగతనం జరుగగా, అట్టి దొంగతనం చేసిన వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. జివ్వాడి గ్రామానికి చెందిన వడ్ల పండరి దసరా పండుగ సందర్భంగా బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చే సరికి ఇంట్లో దొంగతనం జరిగింది. ఈ విషయమై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దొంగలించిన వస్తువులను గాంధారి గ్రామంలోని ఒకే స్టీల్ దుకాణంలో విక్రయించడానికి ప్రయత్నించారు. అనుమానం వచ్చిన షాప్ యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అట్టి నిందితులను పట్టుకొని విచారించాగా దొంగతనం చేసినట్లు నిర్ధారించారు. దొంగతనం చేసిన నిందితులు ఇద్దరూ కూడా బాధితుని బంధువులు అని తేలింది. నిందితులు జివ్వాడి వడ్ల రాకేష్, వడ్ల శ్రీకాంత్ లను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

# గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం.

ఎడపల్లి, అక్టోబర్ 19, సూర్య మేజర్ న్యూస్

ఎడపల్లి మండలం జానకంపేట గ్రామ సిటీ సి ట్రైనింగ్ సెంటర్ ముందర గల చెరువులో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని మహిళ అందాజా 60 సంవత్సరాల వయసు ఉంటుందని, జానకంపేట గ్రామానికి చెందిన మహేష్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి కి పంపినట్లు తెలిపారు. ఎవరైనా తమ పరిధిలో కనిపించకుండా పోయిన మహిళ ఎవరైనా ఉంటే ఎడపల్లి పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు.



# చాతి నొప్పి భరించలేక ఒకరు మృతి


లింగంపేట్, అక్టోబర్ 19, సూర్య మేజర్ న్యూస్


లింగంపేట్ మండల కేంద్రానికి చెందిన దొడ్ల దాసుగౌడ్ (53) అనే వ్యక్తి కడుపు నొప్పి భరించలేక జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడని లింగంపేట్ ఎస్సై అరుణ్ తెలిపారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి ఆరు సంవత్సరాల నుండి చాతి నొప్పితో బాధపడుతూ హైదరాబాద్ మల్లారెడ్డి ఆసుపత్రిలో దాసుగౌడ్ కు స్టంట్ వేయడం జరిగిందన్నారు హైదరాబాదులోని తన కుటుంబంతో ఉంటూ ఈనెల 17 న తన కుటుంబ సభ్యులకి ఎవరికీ చెప్పకుండా లింగంపేట్ కి వచ్చి ఈనెల 18 శుక్రవారం రోజున మధ్యాహ్నం అందాజా 3:30 గంటలకు లింగంపేటలోని తన ఇంటిలో ఉరివేసుకొని మృతి చెందాడ ని తెలిపారు. కుమారుడు విశాల్ గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయడమైనదని ఎస్సై పేర్కొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న తెలంగాణ యూనివర్సిటీ.

- సెమిస్టర్ ఫలితాల్లో అవకతవకలు
- సెమిస్టర్ పరీక్ష పత్రాల దిద్దుబాటులో ప్రొఫెసర్ల నిర్లక్ష్యం..
- రీవాల్యుయేషన్, ఇంప్రూవ్మెంట్,బ్యాక్లాగ్ ఫీజుల పేరుట విద్యార్థులపై ఆర్థిక భారం.
- గత మూడేళ్లుగా స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ లేక విద్యార్థులు విలవిల..
- రివల్యూషన్ పేరుతో ఒక్కో పేపర్ కి 600 రూపాయలు వసూలు.
- ఏ ఐ పీ ఎస్ యు నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు సాయికుమార్ వెల్లడి.

( వివరాలు 2 వ పేజీలో.....)



# స్టార్ హొటల్స్ పై ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ దాడులు

## దొరికిన కుళ్ళిన మాంసం - నోటీసులు జారీ





నిజామాబాద్, అక్టోబర్ 19, సూర్య మేజర్ న్యూస్ : నగరంలోని ఇంటర్నేషనల్ స్టార్ హొటళ్లపై ఫుడ్ సేఫ్టీ టాస్కోర్స్ దాడులు నిర్వహించింది. స్టార్ హొటళ్ళో కుళ్ళిన మాంసం, పనికిరాని తిను బండారాలు బయటపడ్డాయి. తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆదేశాల ప్రకారం తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ ఫుడ్ ఇన్స్పెక్టర్స్ రోహిత్ రెడ్డి, పి.స్వాతి, శిర్షిక లతో కూడిన బృందం దాడులు చేపట్టారు. నగరంలోని లహరి, వంశీ ఇంటర్నేషనల్ హొటల్స్ లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. లహరి ఇంటర్నేషనల్ రెస్టారెంట్ నందు రిఫ్రిజిరేటర్ లో ఫుడ్ సేఫ్టీ ప్రమాణాల ప్రకారం సరైన ఉష్ణోగ్రతను మైంటైన్ చేయకపోవడం, ఫుడ్ గ్రేడ్ లేని ప్లాస్టిక్ కవర్లలో భారీగా 122.5 కిలోలు, 30 వేల రూపాయల విలువ కలిగిన కుళ్ళిన మాంసపు ఉత్పత్తులను నిలువ చేసి, హానికర ప్రమాదకరమైన రు.4,200 విలువ గలిగిన మసాలా మిర్చి పేస్ట్ లను ఫంగస్ బూజు పట్టిన కూరగాయలను గుర్తించడంతో హొటల్ యాజమాన్యం పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటికప్పుడే ప్రజల ఆరోగ్యానికి భంగం కలవకూడదని మాంసపు ఉ

2

# ఆరోగ్య ఉపకేంద్ర నిర్మాణ పనులను పరిశీలించిన వైద్యులు

బిక్కనూర్, అక్టోబర్ 19, సూర్య మేజర్ న్యూస్

మండల కేంద్రంలోని నూతనంగా నిర్మిస్తున్న రెండవ ఆరోగ్య ఉప కేంద్రాన్ని, అలాగే మండలంలోని రామేశ్వర్ పల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆరోగ్య ఉపకేంద్ర నిర్మాణ పనులను మండల ఇంచార్జ్ వైద్యాధికారి దివ్య శనివారం పరిశీలించారు. గత సంవత్సర కాలంగా మండల కేంద్రంలో నిర్మాణ పనులు నిలిచిపోయాయని స్థానికులు వారికి వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల నిర్మాణ విషయంలో జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లి త్వరగా నిర్మాణం పూర్తయ్యే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి వెంకటరమణ, ఆయా గ్రామాల ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.



## ప్రభుత్వ భూమిని రక్షించండి

**గాంధారి, సూర్య మేజర్ న్యూస్, అక్టోబర్ 19**

గాంధారి మండలంలోని మొండిసడక్ -సర్వాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో గల ప్రభుత్వ భూమిని అక్రమణదారుల నుండి కాపాడాలని ఎంపీడీఓ కు ముదెల్లి గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. శనివారం గ్రామానికి చెందిన పెద్దలు మండల కార్యాలయానికి వచ్చి తమ గోడును వివరించారు. గ్రామపంచాయతీ పరిధిలో గల ప్రభుత్వ భూమిని అధికార పార్టీకి చెందిన కొందరు కబ్జా చేయాలనీ ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. అక్రమార్కుల దగ్గరి నుండి ప్రభుత్వ భూమిని కాపాడి గ్రామపంచాయతికి న్యాయం చేయాలని వినతిపత్రంలో తెలిపారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రం ను ప్రారంభించిన ఎమ్మెల్యే.

**ఎల్లారెడ్డి, అక్టోబర్ 19, సూర్య మేజర్ న్యూస్**

ఎల్లారెడ్డి మండలంలోని శివనగర్ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మదన్మోహన్ రావు ప్రారంభించారు శనివారం మధ్యాహ్నం శివనగర్ పరిసర ప్రాంతాల రైతులకు దూర భారం తగ్గ దానికి కొరకు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు అనంతరం ఆయన మాట్లాడుతూ., రైతుల నుండి వరి ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు కొనుగోలు కేంద్రం వద్ద ఎలాంటి అవకతవకలకు పాల్పడరాదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మన్నే ప్రభాకర్, తాసిల్దార్ మహేందర్ కుమార్, ఆర్ ఐ శ్రీనివాస్ ఎల్లారెడ్డి సొసైటీ చైర్మన్ ఏగుల నర్సింలు, వైస్ చైర్మన్ మత్త మాల ప్రశాంత్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రజిత వెంకట్రాంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్ నాగం గోపికృష్ణ, ఆయా గ్రామాల మాజీ సర్పంచులుతో పాటు ఆరిఫ్, తదితరులు పాల్గొన్నారు.



## విచారణ చేపట్టిన శిక్షణ కలెక్టర్

**మాక్లూర్, అక్టోబర్ 19, సూర్య మేజర్ న్యూస్**

మాక్లూర్ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో శనివారం శిక్షణ కలెక్టర్ సంకేత్ కుమార్ అజ్మీరా విచారణ చేపట్టారు. కేజీబివి లో సిఆర్టి గౌతమి మేడం బంగారు గొలుసు పోయినందున ఆరవ తరగతి విద్యార్థిని సహస్రను అధికారుల అనుమతి లేకుండా నిజామాబాద్ మాలపల్లిలో గల మంత్రగని వద్దకు తీసుకువెళ్ళారు. ఆ వీడియోలు సోషల్ మీడియాలో హల్చల్ అవ్వడంతో కేజీబీవి ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయులు కంగుతిన్నారు. విచారణలో భాగంగా శిక్షణ కలెక్టర్ ఒక్కో అధికారిని విడివిడిగా విచారించారు. ఈ ఉదంతానికి దారి తీసిన బాధ్యులపై చర్యలు తీసు కుంటామని శిక్షణ కలెక్టర్ సంకేత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసిడిఓ భాగ్యలక్ష్మి, మండల విద్యాధికారి సత్యనారాయణ, ఎంపీఓ శ్రీనివాస్ ఉన్నారు.



## వరి పంటకు మెడ విరుపు

## తెగులు పట్ల జాగ్రత్త వహించాలి

**బిక్కనూర్, అక్టోబర్ 19, సూర్య మేజర్ న్యూస్**

వరి పంటకు మెడ విరుపు తెగులు సోకిందని, దాని నివారణకు ఐసో ప్రోతిలిన్ రసాయనాన్ని ఉపయోగించాలని మండల వ్యవసాయ అధికారిని రాధారెడ్డి చెప్పారు. శనివారం మండల కేంద్ర శివారులోని వరి పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు రసాయనాన్ని పిచికారి చేసే విధానాన్ని వివరించారు. మరో 15 రోజుల లో పంటలు చేతికి అందే అవకాశం ఉన్నందున రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి వినోద్ గౌడ్, రైతులు పాల్గొన్నారు.



## విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న తెలంగాణ యూనివర్సిటీ.

( మొదటి పేజీ తరువాయి )

**నిజామాబాద్ డెస్క్**

**అక్టోబర్ 19, సూర్య మేజర్ న్యూస్**

అఖిలభారత ప్రగతిశీల విద్యార్థి సంఘం(ఏ ఐ పీ ఎస్ యు) ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోగల అనేక డిగ్రీ పీజీ కళాశాలలో సెమిస్టర్ పరీక్షలు ఎంతో అద్భుతంగా రాసినటువంటి విద్యార్థులకు పరీక్ష ఫలితాలలో మాత్రం ప్రతిసారి చేదు అనుభవం ఎదురవుతుందన్నారు. ఈ సందర్భంగా ఏఐపీఎస్యు నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు సాయికుమార్, విద్యార్థులు కీర్తన, రవితేజ మాట్లాడుతూ., తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోగల డిగ్రీ మరియు పీజీ కళాశాల విద్యార్థులు సెమిస్టర్ పరీక్షలలో ఎంత ప్రతిభ కనబరిచిన చివరికి విద్యార్థులకు నిరాశే శరణం అవుతుందని అన్నారు. మే నెలలో నిర్వహించిన డిగ్రీ 2, 4, 6 రెగ్యులర్ సెమిస్టర్ల ఫలితాలలో అనేక మంది విద్యార్థులు ఒక్కో సెమిస్టర్ లో మూడు నాలుగు పేపర్లు ఫెయిల్ అయినప్పటికీ, మళ్లీ రీవాల్యుయేషన్ ఫీజు కట్టి గత మూడు రోజుల కిందట రివాల్యుయేషన్ ఫలితాల్లో అనేకమంది విద్యార్థులు 70, 80 శాతం అదే పేపర్లో ఉత్తీర్ణత సాధించారన్నారు. అంటే ఇక్కడ తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పరీక్ష పేపర్ల దిద్దుబాటులో ప్రొఫెసర్ల నిర్లక్ష్యం ఎంతైనా ఉందని తెలుస్తుందన్నారు. రివ్యాలువేషన్ పేరుతో, ఇంప్రూవ్మెంట్ పేరుతో విద్యార్థుల జీవితాలతో చలగాటమాడుతూ, తమ నుండి ఫీజులు వసూలు చేస్తూ యూనివర్సిటీ పరిధిలో అది పెద్ద కుంభకోణం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైకం కోసం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న టి యు ఎగ్జామినేషన్ డిపార్ట్మెంట్ అని దుయ్యబట్టారు. ఒకవైపు స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ లు రాక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నప్పటికీ, అది సరిపోనట్టు విద్యార్థుల నుండి ఈ అక్రమ దోపిడీలను ప్రభుత్వం ఖజానా నింపుకోవడానికి మాత్రమేనా? అని ప్రశ్నించారు. తక్షణమే రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెండింగ్ లో ఉన్నటువంటి స్కాలర్షిప్ లను ఫీజు రీయంబ ర్స్మెంట్లను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రివాల్యుయేషన్ ఫీజు ఒక్కో సబ్జెక్టుకు 600 కట్టి అందులో ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ తెలంగాణ యూనివర్సిటీ మీడియా ముఖంగా క్షమాపణ చెప్పాలని, వారి రివాల్యుయేషన్ ఫీజును రిటర్న్ చేయాలని డిమాండ్ చేశారు. సెమిస్టర్ ఫలితాల్లో ఈ అవకతవకలు రెగ్యులర్ వీసీలు లేకపోవడంతో తమ ఇష్టానుసారంగా ప్రొఫెసర్ల పనితీరు ఉండేదని, ఇప్పటికైనా నూతన వైస్ ఛాన్సలర్ యాదగిరి రావు గారు ఇలాంటి తప్పిదాలు జరగకుండా చూడాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. లేనియెడల పెద్ద ఎత్తున విద్యార్థులతో ఆందోళన కార్యక్రమాలు, యూనివర్సిటీ ముట్టడాలు చేయబడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐపీఎస్యు నాయకులు రవితేజ, కీర్తన, అమూల్య, వెంకటేష్, కార్తీక్, కావేరి, మనీషా, అరుణ్, నరసింహ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.




## స్టార్ హొటల్స్ పై ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ దాడులు

( మొదటి పేజీ తరువాయి )

త్పత్తులను ధ్వంసం చేసి నోటీసులు జారీ చేయడం జరిగింది. అలాగే వంశీ ఇంటర్నేషనల్ హొటల్ నందు రు.24వేల విలువగల ఫ్రిడ్జ్ రిఫ్రిజిరేటర్లు నిల్వ ఉంచిన హానికరమైన రంగులతో కూడిన మాంసపు ఉత్పత్తులు ఉడకబెట్టిన మిర్చి పేస్ట్ కాలం చెల్లిన మసాలాపొడులు ధ్వంసం చేయడం జరిగిందని గుర్తించారు. తర్వాత ఆహార పదార్థాలు తయారు, నిల్వ చేసే కిచెన్ సరేనటువంటి వెలుతురు లేకుండా పూర్తిగా అపరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేస్తూ వినియోగదారుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న హొటల్ యాజమాన్యంపై తీవ్ర స్థాయిలో మండిపడి పలు ఎఫ్ఎస్ఎస్ఏ కి సంబంధించిన నోటీసులు జారీ చేయడం జరిగింది. పలు అనుమానాస్పద శాంపుల్స్ ని టాస్క్ ఫోర్స్ సేకరించడం జరిగింది. మిర్చి కాంపౌండ్ లోని పలు మసాలా కారం పసుపు తయారీ కేంద్రాలపై దాడులు జరిపి అనుమానాస్పద శాంపులను సేకరించి ల్యాబ్ కు తరలించడం జరిగింది. ఇంప్రూవ్మెంట్ నోటీసెస్, పలు ఫుడ్ సేఫ్టీ నోటీసులను జారీ చేశారు. ఢిల్లీ వాలా స్వీట్ హౌస్ నందు కూడా ఆకస్మిక తనిఖీలు చేపట్టడంతో అక్కడ ఉన్నటువంటి పరిస్థితులను అపరిశుభ్ర వాతావరణం చూసి అధికారులు విస్తుపోయి స్వీట్ హౌస్ యాజమాన్యంపై ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ టీం హెడ్ వి.జ్యోతిర్మయి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పలు నోటీసులు జారీ చేసి అనుమానిత సేకరించి ల్యాబ్ కి తరలించడం జరిగింది. ఈ రకమైన ప్రజారోగ్యంతో చెలగాటమాడే ఆహార తయారీదారులు ఆహారం అమ్మేవారు ఎంతటి వారైనా సురక్షితమైన ఆహారాన్ని ప్రజలకు అందించాలని హెచ్చరిస్తూ లేనియెడల చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తూ అవసరమైతే సంబంధిత శాఖ సహాయంతో సీజ్ కూడా చేస్తామని హెచ్చరించడం జరిగింది. ఈ టాస్క్ ఫోర్స్ దాడులలో అధికారులతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



## రాష్ట్ర బీడీ కార్మిక సంఘం అధ్యక్షుడు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

**మాచారెడ్డి, సూర్య మేజర్ న్యూస్, అక్టోబర్ 19.**

మాచారెడ్డి మండల కేంద్రంలో శనివారం రాష్ట్ర బీడీ కార్మిక సంఘం అధ్యక్షుడు సిద్దిరాములు ఆధ్వర్యంలో మండలానికి చెందిన బీడీ కార్మికులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., ఐడి కార్డు కలిగి ఉన్నటువంటి బీడీ కార్మికులకు ఎలాంటి కటాఫ్ తేదీ లేకుండా ప్రతి ఒక బీడీ కార్మికురాలికి జీవన భృతి చెల్లించాలని మాచారెడ్డి ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు.

# పాఠశాల స్థాయినుంచే అవగాహన కల్పించాలి.

## కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి బ్యూరో
అక్టోబర్ 19, సూర్య మేజర్ న్యూస్



పాఠశాల స్థాయి నుండే రోడ్డు ప్రమాదాల నివారణ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఐడిఓసి సమావేశ మందిరంలో రోడ్ సేఫ్టీ అంబాసిడర్స్‌కు అవగాహన, క్విజ్ పోటీని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ., విద్యార్థి దశ నుండే ట్రాఫిక్ రూల్స్ తెలుసుకోవడంతో పాటు, తోటి విద్యార్థులకు, తల్లి దండ్రులకు, కుటుంబీకులకు, ఇరుగుపొరుగు వారికి తెలియపరుస్తూ అవగాహన కల్పించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో రోడ్ సేఫ్టీ అంబాసిడర్స్ లను నియమించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని వివిధ 61 పాఠశాలల్లో 122 మంది అంబాసిడర్స్ లను నియమించడం జరిగిందన్నారు. ప్రతీ ఒక్కరికీ డ్రైవింగ్ రూల్స్ తెలియడం వలన ప్రమాదాలను అరికట్టవచ్చని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలను తరచుగా నిర్వహించడం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించవచ్చు అన్నారు. జిల్లా ఎస్పీ సింధు శర్మ మాట్లాడుతూ., జిల్లాలో 520 గ్రామాలుండగా గత సంవత్సరం సుమారు 500 లకు పైగా ప్రమాదాలు జరిగాయని, ప్రతీ రోజూ ప్రతీ ఒక గ్రామంలో ప్రమాదం జరిగినట్లు అవగతం అవుతున్నదని అన్నారు. జిల్లాలో రెండు జాతీయ రహదారులున్నాయని, ప్రతీ వాహన చోదకుడు అప్రమత్తంగా వాహనాలను నడిపించాలన్నారు. ప్రమాదాలు చేసిన వారికి కొత్త చట్టం ప్రకారం 10 సంవత్సరాలు జైలు శిక్ష పడుతుందని తెలిపారు. రోడ్డు భద్రతా కార్యక్రమాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. జిల్లాలో 61 పాఠశాలల్లోని 122 మంది విద్యార్థులను అంబాసిడర్స్ గా నియమించడం జరిగిందని, ప్రతీ ఒక్కరికీ అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి రాజు, డిఎస్పీ నాగేశ్వర్ రావు, పోలీసు అధికారులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏటీసీ కేంద్రాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

## నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నిజామాబాద్ డెస్క్
అక్టోబర్ 19, సూర్య మేజర్ న్యూస్



జిల్లాలోని వివిధ ప్రాంతాలలో కొనసాగుతున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్ (ఏటీసీ) నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులకు సూచించారు. నిజామాబాద్ నగరంలోని శివాజీనగర్ లో గల ప్రభుత్వ బాలుర, బాలికల ఐ.టీ.ఐ ప్రాంగణాలలో నూతనంగా నిర్మిస్తున్న ఏటీసీ భవన సముదాయాల నిర్మాణ పనులను కలెక్టర్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు చేపట్టిన పనుల నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, ఎప్పటిలోగా పనులు పూర్తవుతాయని అధికారులను ప్రశ్నించారు. మరో మూడు మాసాలలో ఏ.టీ.సీ కేంద్రాల భవన సముదాయాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. ఇప్పటికే తొలివిడతగా మంజూరీ లభించిన నిజామాబాద్, బోధన్, కమ్మర్పల్లి ఐ.టీ.సీలలో ప్రవేశాలు చేపట్టినందున వీటి భవన నిర్మాణ పనులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. వచ్చే వారం సంబంధిత శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సైతం నిర్మాణ పనుల పరిశీలనకు విచ్చేసే అవకాశాలు ఉన్నందున నాణ్యతతో యుద్ధ ప్రాతిపదికన పనులు జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని సూచించారు. వీటి నిర్మాణాల విషయంలో ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే తమ దృష్టికి తేవాలని అన్నారు. కలెక్టర్ వెంట సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

# ఎమ్మెల్యే కు వినతి పత్రం అందజేసిన మాజీ జెడ్పిటిసి.

నాగిరెడ్డిపేట్, అక్టోబర్ 19, సూర్య మేజర్ న్యూస్ : నాగిరెడ్డిపేట్ మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ వాహనాన్ని మంజూరు చేయాలని మాజీ జెడ్పిటిసి మనోహర్ రెడ్డి శనివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు కు వినతిపత్రం అందజేశారు. అలాగే రైతులు ధాన్యం ఆరబెట్టడానికి కావలసిన టార్పాలిన్లను ఉచితంగా అందజేయాలని వినతి పత్రంలో కోరినట్లు మనోహర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మనోహర్ రెడ్డి మాట్లాడుతూ., నాగిరెడ్డిపేట్ మండలానికి అంబులెన్స్ సౌకర్యం లేక మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనుకోని ప్రమాదం జరిగితే ప్రాణాలు రక్షించుకునేందుకు అంబులెన్స్ కోసం గంటల కొద్ది వేచి చూడాల్సివస్తుందన్నారు. అత్యవసర పరిస్థితిలో గత్యంతరం లేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారన్నారు. రాత్రివేళ ప్రైవేటు వాహనాల సౌకర్యం కూడా లేదన్నారు. నాగిరెడ్డిపేట్ మండల ప్రజలకు అత్యవసర వైద్య సేవలకు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అంబులెన్స్ మంజూరు చేయాలని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు వినతి పత్రం అందించినట్లు మాజీ జెడ్పిటిసి మనోహర్ రెడ్డి తెలిపారు.



# సామాజిక తనిఖీ పక్కగా నిర్వహించాలి.

## లింగంపేట్ ఎంపీడీవో నరేష్

లింగంపేట్, అక్టోబర్ 19, సూర్య మేజర్ న్యూస్



సామాజిక తనిఖీని పక్కాగా నిర్వహించాలని ఎంపీడీవో నరేష్ ఉపాధిహామీ క్షేత్ర సహాయకులకు తెలిపారు. ఆయన శనివారం లింగంపేట్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ క్షేత్ర సహాయకులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., ఆడిట్ తనిఖీ రికార్డుల సబ్మిషన్ కోసం రికార్డులు సరి చూసుకోవాలని క్షేత్ర సహాయకులకు సూచించారు. ఈ సంవత్సరం ఉపాధిహామీ కింద చేసిన పనులు రికార్డులు ఆడిట్ అధికారులకు చూపిస్తూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మలహరి,ఆడిట్ అధికారి ఎస్సార్ దేవేందర్, ఇంచార్జ్ ఏపీవో బిక్షపతి, టీఏలు ముస్తాల పెద్ది రాజు, సంతోష్, గణేష్, వినోద్, డిఆర్పిలు, ఉపాధిహామీ క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

# మొగిలి చెరువును పరిశీలించిన అదనపు కలెక్టర్

భీమ్‌గల్, అక్టోబర్ 19, సూర్య మేజర్ న్యూస్





భీమ్‌గల్ పట్టణంలోని మొగిలి చెరువును అదనపు కలెక్టర్ అంకిత్ శనివారం పరిశీలించారు. ఆర్మూర్ ఆర్డీవో రాజారెడ్డి, ఎంపీడీఓ సంతోష్ కుమార్, తహసీల్దార్ షబ్బీర్, మున్సిపల్ కమీషనర్ రామకృష్ణ లతో కలిసి చెరువు వద్దకు చేరుకున్నారు. గతంలో మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మొగిలి చెరువును పరిశీలించిన సంగతి విధితమే. చెరువు నాలా కబ్జాను తీయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో పాటు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఇరిగేషన్ డీఈ తో మాట్లాడి చెరువు నిండి అలుగు నీరు వెళ్లే నాలా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. నాలా కబ్జా కావడంతో అలుగు నీరు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయిందని, వెంటనే సర్వే పూర్తి చేయించి నాలా తవ్వించాలని సూచించారు. అనంతరం చెరువు పరిసర ప్రాంతాన్ని అదనపు కలెక్టర్ పరిశీలించి స్థానిక అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# ఎల్లారెడ్డి కస్తూర్బా గాంధీ పాఠశాల అదనపు గదుల

## నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి, అక్టోబర్ 19, సూర్య మేజర్ న్యూస్





ఎల్లారెడ్డి కస్తూర్బా గాంధీ పాఠశాలలో అదనపు గదులకు శనివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ., కస్తూర్బా గాంధీ పాఠశాల కళాశాల అదనపు గదుల కొరకు 3.25 కోట్లతో నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో విద్యార్థిని, విద్యార్థులకు ప్రతి పాఠశాలలో అన్నీ మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తుందని, దానికి కూడా త్వరలోనే శంకుస్థాపన చేస్తామన్నారు. విద్యార్థిని విద్యార్థులకు విద్యా, క్రీడా రంగాలలో తగిన ప్రోత్సహిస్తామని ఈ సందర్భంగా అన్నారు, శంకుస్థాపన కార్యక్రమంలో ఆర్డీఓ మన్నె ప్రభాకర్, తాసిల్దార్ మహేందర్ కుమార్, ఎల్లారెడ్డి విద్యాధికారి వెంకటేశం, పురపాలక చైర్మన్ పద్మ శ్రీకాంత్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, మొత్తం మాల ప్రశాంత్ గౌడ్, కౌన్సిలర్ జంగం నీలకంఠం, అల్లం శ్రీనివాస్ తో పాటు కస్తూర్బా గాంధీ పాఠశాల ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

# జీవితంపై విరక్తి చెంది ఒకరు మృతి

**లింగంపేట్, అక్టోబర్ 19, సూర్య మేజర్ న్యూస్**



జీవితంపై విరక్తి చెంది లింగంపేట్ మండల కేంద్రానికి చెందిన జినుగురి రాజు 46 అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని లింగంపేట ఎస్సై అరుణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కామారెడ్డిలో సెంట్రింగ్ పని చేసుకుంటూ జీవించేవాడని మద్యం జూదంకు అలవాటు పడి అప్పుల పాలై జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి లింగంపేట్ మండల కేంద్రంలోని తన పాత ఇంటిలో ఉరి వేసుకొని చనిపోయాడన్నారు. మృత్యునికి భార్య లావణ్య, కుమార్తెలు తనుజ ఉన్నారు. మృతిని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించడం అయినదని ఎస్సై పేర్కొన్నారు.

## ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలి రావాలి

**బిక్కనూర్, అక్టోబర్ 19 సూర్య మేజర్ న్యూస్**



నేడు ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా పదవి బాధ్యతలు చేపట్టనున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్ రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి జిల్లాలోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, సానుభూతిపరులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జనరల్ సెక్రెటరీ చేపూరి రాజు కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, పార్లమెంట్ సభ్యుడు సురేష్ షట్కర్, ఎమ్మెల్యేలు మదన్ మోహన్ రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మి కాంతారావు హాజరుకానున్నట్లు ఈ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## బీజేపీ పార్టీ కి బిగ్ షాక్.

**కాంగ్రెస్ లో చేరిన బిజెపి ఓబిసి జిల్లా ఉపాధ్యక్షుడు గంపల వెంకయ్య.**

**నాగిరెడ్డిపేట్, అక్టోబర్ 19, సూర్య మేజర్ న్యూస్.**

భారతీయ జనతా పార్టీ ఓ బి సి జిల్లా ఉపాధ్యక్షుడు, మండలంలోని చిన్నూర్ గ్రామానికి చెందిన గంపల వెంకన్న శనివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆయన ను కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా గంపల వెంకయ్య మాట్లాడుతూ., రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు, విట్టల్ రెడ్డి, రామచంద్ర రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.



## పోలీస్ విధులపై విద్యార్థులకు అవగాహన

**గాంధారి, సూర్య మేజర్ న్యూస్, అక్టోబర్ 19**



గాంధారి పోలీస్ స్టేషన్లో పోలీస్ విధుల నిర్వహణపై విద్యార్థులకు ఎస్ఐ ఆంజనేయులు అవగాహన కల్పించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం అక్టోబర్ 21 ని పురస్కరించుకొని స్థానిక పోలీస్ స్టేషన్లో శనివారం విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు పోలీస్ వ్యవస్థ పని చేస్తున్న తీరును ఎస్ఐ వివరించారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్లో గల ఆయుధాల పని తీరును వివరించారు. విద్యార్థులకు న్యాయ చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# మీ పిల్లలు కళాశాలకి వెళుతున్నారా? లేదా తెలుసుకోవాలి..!

- విద్యార్థులు ప్రతిరోజు కళాశాలకి రావాలి.
- విద్యార్థులు ఆబ్సెంట్ అయితే తల్లిదండ్రులకు తెలియజేయాలి.
- కళాశాలలో ఏదైనా సమస్య ఉంటే వెంటనే ప్రిన్సిపాల్ కి తెలియజేయాలి.
- దోమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేరెంట్స్ మీటింగ్ లో జిల్లా కలెక్టర్

**కామారెడ్డి బ్యూరో, అక్టోబర్ 19, సూర్య మేజర్ న్యూస్**



ప్రతీ రోజూ కళాశాలకు హాజరై విద్యాబుద్ధులు నేర్చుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం రోజున దోమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ., గత సంవత్సరం ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత శాతం రాష్ట్రంలో చివరి స్థానంలో ఉందని అన్నారు. విద్యార్థులు ప్రతీ రోజు కళాశాలకు రావాలని, అటెండెన్స్ ప్రతీ రోజూ ఉండాలని, లెక్చరర్స్ చెప్పిన పాఠాల్ని ఏ రోజు కారోజు అర్థం చేసుకోవాలని, ఏదైనా సమస్యలు ఉంటే కళాశాల ప్రిన్సిపాల్ కు తెలియజేయాలని అన్నారు. తమ పిల్లలు రోజు కళాశాలకు వెళ్తున్నారా లేదా తెలుసుకోవాలని, విద్యార్థులు హాజరైనది లేనిది పేరెంట్స్‌కు తెలపాలని, అందుకు ప్రతీ విద్యార్థి పేరెంట్స్ సెల్ ఫోన్ కళాశాలలో నమోదు చేయాలని, ఏ విద్యార్థి అయితే కళాశాలకు అబ్సెంట్ అయితే అట్టి విషయాన్ని సంబంధిత పేరెంట్స్ కు తెలపాలని ప్రిన్సిపాల్ కు సూచించారు. ఆర్టీసి బస్సులు కళాశాల వద్ద ఆపడానికి, వివిధ గ్రామాల నుండి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం కోసం సమయానుకూలంగా బస్సులను నడిపే విధంగా ఆర్టీసీ అధికారులతో మాట్లాడతానని కలెక్టర్ తెలిపారు. పిల్లలు రెగ్యులర్ గా కళాశాలకు వచ్చినప్పటికీ మధ్యాహ్నం భోజన సమయంలో ఇంటికి వెళ్తున్నారని, టిఫిన్ డబ్బా తెచ్చుకోలేదు అని విద్యార్థులు చెప్పడం జరుగుతుందని తెలిపారు. ఇకముందు పిల్లలకు సమయానికి భోజనం ఏర్పాటు చేసి ప్రతీ రోజూ కళాశాలకు హాజరయ్యేవిధంగా పేరెంట్స్ సహకరించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సలాం, తహసీల్దార్ సంజయ్ రావు, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, మండల ప్రత్యేక అధికారి జ్యోతి, పేరెంట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

## హిందూ దేవాలయలపై దాడి చేస్తే ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.

- విశ్వహిందూ పరిషత్, బజరంగ్దళ్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కి వినతి పత్రం అందజేత

**బోధన్, సూర్య మేజర్ న్యూస్, అక్టోబర్ 19**



తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల అన్య మతస్తులు హిందు దేవాలయాలపై, హిందూ దేవుళ్ళపై, హిందువులపై దాడులకు పాల్పడుతున్నారని ఇట్టి చర్యలను నిరసిస్తూ హిందూ దేవాలయ పై దేవుళ్ళపై హిందువులపై ఎవరైనా దాడి చేస్తే వారిపై ప్రభుత్వం వెంటనే కఠినచర్యలు తీసుకునే విధంగా చూడాలని నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని విశ్వహిందూ పరిషత్, బజరంగ్దళ్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతో కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విహెచ్పి జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ హిందువులపై అన్య మతస్తులు చేసే దాడులను ఖండిస్తున్నామని, ఇలాంటి వాటిపై పోలీసులకు, ప్రభుత్వానికి ఫిర్యాదు చేసిన నామమాత్రపు దర్యాప్తు చేసి వారిని విడిచి పెడుతున్నారని ఇకనుండి ఇట్టి విషయాలపై సహించేది లేదని, ప్రభుత్వం, పోలీసులు కూడా హిందూ దేవాలయాలపై దేవుళ్లపై హిందువులపై దాడులు జరిపిన వారిపై, హిందువుల మనోభావాలను హరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ సమస్త హిందువుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఇట్టి కార్యక్రమంలో విహెచ్పి జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్, విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ప్రముఖులు సురేష్ ఇనాని, కోటేశ్వరరావు, ఉదయ్, కృష్ణ, శివ చరణ్, శ్రావణ్, శివకృష్ణ, స్వప్నిల్, ప్రియష్, సాయినాథ్, శివ చరణ్, భావేష్, సంఘం శ్రీనివాస్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే



**నాగిరెడ్డిపేట్, అక్టోబర్ 19, సూర్య మేజర్ న్యూస్** : నాగిరెడ్డిపేట మండలానికి నూతనంగా మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మోహన్ రావు తనిఖీ చేశారు. కళాశాలలో విద్యార్థులకు కావలసిన సరైన మౌలిక వసతులు లేకపోవడంతో ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కొన్ని రోజుల క్రితం కళాశాలలో ఫర్నిచర్, కంప్యూటర్, మిగతా వస్తువుల నిమిత్తం ఎనిమిది లక్షలు నిధులు మంజూరు చేశానని తెలిపారు. గెస్ట్ ఫ్యాకల్టీ ద్వారా విద్యార్థులకు ఇబ్బంది కాకుండా కొత్తగా ఉపాధ్యాయులను నియమించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి షేక్ సలాంతో ఫోన్లో మాట్లాడారు. ఉపాధ్యాయుల కొరత గురించి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామన్నారు. ఏ ఒక్క విద్యార్థి ఇబ్బంది పడకుండా అన్ని వస్తువులు సరిపడా ఉపాధ్యాయులను నియమిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, నాయకులు విట్టల్ రెడ్డి, రామచంద్రారెడ్డి, ఇమామ్, షాహిద్, సాయగౌడ్, గులాం హుస్సేన్ గణేష్, తదితరులున్నారు.

# అనాథ బాలల కోసం భవిష్యజ్యోతి ట్రస్ట్ ఏర్పాటు

## ♦ దాతల తోడ్పాటుకు కలెక్టర్ పిలుపు

## ♦,పాల్గొన్న జిల్లా జడ్జి, సీ.పీ, బెటాలియన్ కమాండెంట్





**నిజామాబాద్, అక్టోబర్ 19, సూర్య మేజర్ న్యూస్**

అనాథ బాలలకు నాణ్యమైన విద్యను అందించి ఉజ్వల భవితకు బాటలు వేయాలనే మహోన్నత సంకల్పంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో భవిష్యజ్యోతి ట్రస్ట్ ను నెలకొల్పడం ఎంతో అభినందనీయమని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. తల్లిదండ్రులు లేని చిన్నారుల అభ్యున్నతి కోసం ఏర్పాటైన ట్రస్ట్ కు అన్ని వర్గాలకు చెందిన దాతలు విరివిగా విరాళాలు సమకూర్చి తమవంతు తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు. డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో అనాథ పిల్లల కోసం ఏర్పాటైన ట్రస్ట్ ను కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభోత్సవం చేశారు. శనివారం కోర్టు భవన సముదాయ కాన్ఫరెన్స్ హాల్ లో జరిగిన కార్యక్రమానికి జిల్లా సెషన్స్ జడ్జి సునీత కుంచాల అధ్యక్షత వహించగా పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, డిచ్పల్లి పోలీస్ బెటాలియన్ కమాండెంట్ రోహిణి ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ., అనాథ బాలికలకు ప్రాథమిక దశ నుండే నాణ్యమైన విద్యను అందించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలనే దృక్పథంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నెలకొల్పిన ట్రస్ట్ కు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. సాధారణంగా న్యాయ సేవాధికార సంస్థలు లోక్ అదాలత్ ల నిర్వహణ, న్యాయ పరమైన అంశాలపై అవగాహన సదస్సులకే పరిమితమవుతాయని, అందుకు భిన్నంగా నిజామాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తుండడం ముదావహమని ప్రశంసించారు. స్వీయ రక్షణ కోసం రికార్డు స్థాయిలో 11వేల మంది బాలికలకు కరాటేలో శిక్షణ ఇప్పించడం, గ్రామాభివృద్ధి కమిటీల పనితీరును పెంపొందించే కార్యక్రమాలను నిర్వహించడం వంటి అనేకానేక కార్యక్రమాలను డీఎల్ఎస్ఏ చేపట్టిందని గుర్తు చేశారు. తాము అనాథలం అనే భావనను విడనాడి, చక్కగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. అనాథ బాలలకు ఉచితంగా ప్రవేశాలు కల్పించిన కాకతీయ స్కూల్, రవి పబ్లిక్ స్కూల్, నిర్మల హృదయ్ పాఠశాలల యాజమాన్యాలను కలెక్టర్ అభినందించారు. జిల్లా జడ్జి కుంచాల సునీత మాట్లాడుతూ., నిజామాబాద్ లోని బాలసదన్ లో ఆశ్రయం పొందుతున్న అనాథ బాలలకు నాణ్యమైన విద్యను ఇప్పిస్తూ వారికి అన్ని విధాలుగా తోడ్పాటుగా నిలవాలనే ఆశయంతో భవిష్య జ్యోతి ట్రస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థుల చదువుతో పాటు అవసరమైన ఇతర సదుపాయాలన్ని ట్రస్ట్ ద్వారా సమకూరుస్తామని తెలిపారు. కోరిన వెంటనే 30మంది అనాథ బాలికలకు ఉచితంగా ప్రవేశాలు కల్పించేందుకు ముందుకు వచ్చిన కాకతీయ, రవి పబ్లిక్, నిర్మల హృదయ్ పాఠశాలల యాజమాన్యాలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తరపున జిల్లా జడ్జి కృతజ్ఞతలు ప్రకటించారు. అదేవిధంగా నలుగురు అనాథ బాలలను పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ దత్తత తీసుకున్నారని, సీ.పీ కనబర్చిన సేవా దృక్పథాన్ని అభినందించారు. అనాథ బాలలకు చక్కటి భవిష్యత్తును అందించేందుకు వీలుగా దాతలు భవిష్య జ్యోతి ట్రస్ట్ కు విరాళాలు అందించి తమ ఉదారత్వాన్ని చాటుకోవాలని పిలుపునిచ్చారు. ట్రస్ట్ పేరిట ప్రత్యేకంగా నిజామాబాద్ నగరంలోని ఐ.సీ.ఐ.సీ.ఐ బ్యాంకు, నాందేవ్ వాడ బ్రాంచ్ లో అకౌంట్ తెరవడం జరిగిందన్నారు. దాతలు తమ విరాళాలను భవిష్య జ్యోతి, అకౌంట్ నెంబర్: 354705001646, ఐ.ఎఫ్.ఎస్.సీ కోడ్: ఐసీఐసీ 003547, ఐసీఐసీఐ బ్యాంకు, నాందేవ్ వాడ బ్రాంచ్ లో జమ చేయవచ్చని సూచించారు. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ అనాథ బాలలను దత్తత తీసుకునే అవకాశం కలగడాన్ని తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. తాను బదిలీపై వెళ్తున్నప్పటికీ దత్తత తీసుకున్న బాలలకు తనవంతు తోడ్పాటును అందిస్తుంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి టీ.శ్రీనివాస్, ప్రైవేట్ విద్య సంస్థల నిర్వాహకులు రజనీకాంత్, సరళా మహేందర్, న్యాయాధికారులు, బాలసదన్ చిన్నారులు పాల్గొన్నారు.

# నేడే మెగా రక్తదాన శిబిరం.

## రక్తదాతలు చిన్నారుల ప్రాణాలను కాపాడడానికి ముందుకు రావాలి.

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 19, సూర్య మేజర్ న్యూస్**



తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరాన్ని ఆదివారం రోజున ఉదయం 09 గంటల నుండి మధ్యాహ్నం ఒకటి గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, చిన్నారులకు రక్తం దొరకక తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని వారి ప్రాణాలను కాపాడాలని మంచి ఉద్దేశంతో ఈ మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ మరియు ఐవీఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి లు రక్తదానం చేసిన రక్తదాతలను అభినందించడానికి రావడం జరుగుతుందని ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలియజేశారు. రక్తదానం పట్ల ఉన్న అపోహలను విడనాడి చిన్నారుల ప్రాణాలను కాపాడడానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న యువత రక్తదానానికి ముందుకు రావాలని అన్నారు ఒక రక్తదాత చేసే రక్తంతో ఒక చిన్నారి ప్రాణాలను 15 రోజుల పాటు కాపాడవచ్చునని రక్తదాతలకు ప్రశంసా పత్రాలను అందజేయడం జరుగుతుందన్నారు రక్తదానం చేయాలనుకునేవారు మరిన్ని వివరాల కోసం 9492874006 నంబర్ కి సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షుడు డాక్టర్ వేదప్రకాష్, ప్రధాన కార్యదర్శి గంప ప్రసాద్, ఉపాధ్యక్షులు జమీల్ హైమద్, డాక్టర్ పుట్ల అనిల్ కుమార్, సలహాదారులు ఎర్రం చంద్రశేఖర్, రమణ లు పాల్గొనడం జరిగింది.

# దిష్టి బొమ్మ దగ్ధం ......

**భీమ్‌గల్, అక్టోబర్ 19, సూర్య మేజర్ న్యూస్**





భీమ్‌గల్ మండల భారత రాష్ట్ర సమితి పార్టీ ఆద్వర్యంలో ప్రభుత్వ దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు దోనకంటి నర్సయ్య మాట్లాడుతూ గత సీజన్ రైతుభరోసా కూడా రేపు మాపు అంటూ ఇవ్వలేదని, ఇప్పుడు ఈ సీజన్ రైతు భరోసా కూడా ఇవ్వలేమని వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడటం రైతులను నమ్మించి మోసం చేసినట్టే అని అన్నారు. పంట పెట్టుబడి కోసం రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారని కానీ ప్రభుత్వం వారి ని మళ్ళీ మోసం చేసిందన్నారు. రైతులు ఇప్పుడు పంట వేయడానికి పెట్టుబడి పెట్టాలంటే మళ్ళీ వ్యాపారస్థుల దగ్గర వడికి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. గత ప్రభుత్వంలో పండగ అన్న వ్యవసాయం ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో దండగ అనేలా ఉంది అన్నారు. రుణమాఫీ లేదు,కరెంట్ సక్రమంగా ఇవ్వటం లేదు ఇప్పుడు పంట పెట్టుబడి ఎగ్గొట్టారు రైతులన్ని గమనిస్తున్నారు రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీ కి ప్రభుత్వానికి రేవంత్ రెడ్డి కి తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు శర్మ నాయక్ ,సొసైటీ చైర్మన్ నర్సయ్య, తుక్కాజీనాయక్, జిందం రాజేష్, సిద్దపల్లి రాములు, ఉపాధి నర్సయ్య, బోర్ లింగం, గోలి శ్రీకాంత్, రాజు నాయక్, వాసు, గున్నాల భగత్, పతాని లింబాద్రి కార్మిక శాఖ అధ్యక్షుడు డిష్ గంగాధర్ , వివిధ గ్రామాల తాజా మాజీ సర్పంచ్లు ఎంపీటీసీలు , బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోళ్లలో రైతులను మోసం చేస్తే కేసులు నమోదు చేస్తాం : ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు

**నాగిరెడ్డిపేట్, అక్టోబర్ 19, సూర్య మేజర్ న్యూస్.** : వరి ధాన్యం కొనుగోళ్లలో సొసైటీలు రైతులను మోసం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు హెచ్చరించారు. శనివారం మండలంలోని మాల్ తుమ్మెద సొసైటీ పరిధిలో గోపాల్ పేట్, తాండూర్ సొసైటీ పరిధిలో ధర్మారెడ్డి గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకట్రాం రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలు లేకుండా, తరుగు పేరిట రైతులకు మోసం జరగకుండా తూకం వేయాలని అన్నారు. రాబోయే రోజుల్లో ప్యాడి క్లీనింగ్ మిషన్ లు కొనుగోలు చేసి రైతులకు ఆసరా గా నిలుస్తామన్నారు. కొనుగోలు కేంద్రాలలో ఎవరైనా అక్రమ వసూళ్లకు పాల్పడితే తను దృష్టికి తీసుకురావాలని తెలిపారు. రైతులు సంతోషంగా ఉంటే గ్రామాలు, రాష్ట్రాలు, మన దేశం సుభిక్షంగా ఉంటుంది అని అన్నారు. రైతులను ఇబ్బంది పెట్టిన వారిపైనా చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకట్ రాంరెడ్డి, ఎల్లారెడ్డి ఆర్డిఓ మన్నే ప్రభాకర్, మండల ప్రత్యేక అధికారి రత్నం, మాల్తుమ్మెద సొసైటీ చైర్మన్ దుందిగళ్ళ నర్సింలు, తాండూర్ సొసైటీ చైర్మన్ ఆకిడి గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దివిటీ కిష్టయ్య, సీనియర్ నాయకులు, రామచంద్ర రెడ్డి, సొసైటీల ఉపాధ్యక్షులు, డైరెక్టర్లు, సొసైటీ కార్యదర్శులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.